క్లుప్తంగా

రిమ్స్‌లో పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న రిమ్స్ డైరెక్టర్, లయన్స్ క్లబ్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రపంచ మానవతా దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రిమ్స్‌లో రోగులకు, వారి బంధువులకు పండ్లు పంపిణీ చేశారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, భగవాన్‌దాస్, నిర్మల్కర్ విశ్వాస్, గంగయ్య, వెంకటరమణ, ఆనంద్ రెడ్డి, సుధాకర్, కలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న ఆడే గజేందర్

నేరడిగొండ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని కుమారి గ్రామంలో శబరిమాత ఆశ్రమ, గురుదేవ్ సేవాశ్రమం కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మంగళవారం ఆశ్రమానికి వెళ్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఆశ్రమాలకు ప్రహరీ గోడ, బోర్లు త్వరలో మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. కాగా అందరితో కలిసి భోజనం చేశారు. కమిటీ సభ్యులు నారాయణ, శంకర్, సుభాష్ గౌడ్, భోజన్న, మల్లేష్, రాములు, బోథ్ వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షుడు వసంత్ రావు, సర్పంచ్ రాజుయాదవ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

భీంపూర్: పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం మొబైల్ వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మండల వైద్యాధికారి నిఖిల్‌రాజ్, మండల వైద్యవిస్తరణ అధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు రూహిదాస్, మేఘ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, ఐసీటీసీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో..

ఇచ్చోడ: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇచ్చోడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో బ్రహ్మానందంరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగీ, డయేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ప్రతీరోజు కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని సూచించారు. అనంతరం వంట గదిని పరిశీలించారు. పీహెచ్‌ఎన్ రాజుబాయి, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, ఏఎన్‌ఎంలు సుధారాణి, పద్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నేరడిగొండ: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సమక్షంలో గుడిహత్నూర్ మండలంలోని మాచాపూర్, కొలంగూడా గ్రామాలకు చెందిన దాదాపు 30 మంది కాంగ్రెస్‌లో చేరారు. నేరడిగొండలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆడే గజేందర్ వారికి పార్టీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో నేరడిగొండ మండల అధ్యక్షుడు ఆడే వసంత రావు, నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, పోతారెడ్డి, సద్దాం, రాథోడ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పారితోషకాలు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఆశవర్కర్ల జూలై నెల పారితోషకాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. మంగళవారం సీఐటీయూ నాయకులు వైద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆశలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలని, ప్రస్తుతం ఇస్తున్న పారితోషికంలో సగం పెన్షన్ నిర్ణయించాలని తెలిపారు. ఆశల సంఘం జిల్లా కార్యదర్శి సుజాత, లక్ష్మి, హారిక తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఆశవర్కర్ల జూలైతోపాటు ఆగస్టు నెల పారితోషకాలు చెల్లించాలని తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాలు కోరారు. మండలంలోని శ్యాంపూర్ వైద్యాధికారిని మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు.

కరత్వాడ..నీటిని ఒడిసి పట్టలేక

- పూడికతో నిండిన ప్రాజెక్టు..
- వృథాగా పోతున్న నీరు
- మరోవైపు కాలువల్లో పెరిగిన చెట్లు
- రబీకి రైతులకు కష్టాలేనా?



ఎడమ కాలువలో పెరిగిన చెట్లు



అలుగు వద్ద పేరుకుపోయిన మట్టి

బోథ్: మండలంలోని కరత్వాడ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం తగ్గినట్లు కనిపిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన నీటితో ప్రాజెక్టు నిండింది. అయితే పూడికతీత తీయకపోవడంతో ప్రాజెక్టులోకి నీరు అలుగు ద్వారా వెళ్లిపోయింది. ప్రాజెక్టులో పూడికతీత తీయకపోవడం, కాలువలు శిథిలావస్థకు చేరుకోవడం వంటి ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూడికతో నిండిన ప్రాజెక్టు

ప్రాజెక్టులు నిర్మించిన ప్రధాన ఉద్దేశం.. వర్షాకాలంలో వచ్చిన నీటిని నిల్వ చేసి, రబీ సీజన్‌లో పంటలకు ఉపయోగించుకోవడం. అయితే కరత్వాడ ప్రాజెక్టులో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఏళ్ల తరబడి పూడికతీత చేపట్టకపోవడంతో, వరద నీటితో కొట్టుకువచ్చిన మట్టి ప్రాజెక్టులో పేరుకుపోయింది. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండకముందే పొంగిపొర్లుతోంది. ఫలితంగా ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి వచ్చిన నీరు, వృథాగా వెళ్లిపోవాల్సి వస్తోంది. ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టాల్సిన ఈ ప్రాజెక్టు, పూడిక కారణంగా తన సామర్థ్యాన్ని కోల్పోయింది. గతేడాది రబీ సీజన్‌లో నీరు లేక పంటలు ఎండిపోయిన చేదు అనుభవం ఇంకా రైతులను వెంటాడుతూనే ఉంది. ఈసారి కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందని రైతులు భయపడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పూడికతీత పనులు చేపట్టకపోతే, రబీ సీజన్‌లో పంటలు పండించడం కష్టమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో కాలువలు..

చివరి ఆయకట్టుకు అందని నీరు

కరత్వాడ ప్రాజెక్టుకు కేవలం పూడిక సమస్య మాత్రమే కాదు. దాని కుడి, ఎడమ కాలువలు కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువలు పలుచోట్ల దెబ్బతినడం, పిచ్చిమొక్కలు, చెట్లు పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో కాలువల నుంచి చాలా నీరు వృథాగా పోవడమే కాకుండా, చివరి ఆయకట్టుకు నీరు అసలు అందడం లేదు. ఆఖరి దశ పంటలకు నీరందక రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు. కాలువల మరమ్మతు, వాటిని శుభ్రం చేయించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే, ప్రాజెక్టులో నీరు నిల్వ ఉన్నప్పటికి చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి ఉందని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన కరత్వాడ ప్రాజెక్టులో పూడికతీత పనులు, కాలువల మరమ్మతు చేపట్టాలని వారు కోరుతున్నారు.

నీరందడం లేదు



కరత్వాడ ప్రాజెక్టు ఎడమ కాలువ నీరు చివరి ఆయకట్టు వరకు అందడం లేదు. రబీ సీజన్‌లో నీరు వదులుతున్నా కాలువల్లో చెట్లు పెరగడం, మట్టి పేరుకుపోవడంతో నీరు రావడం లేదు. రబీలో పంటలు ఎండిపోతున్నాయి. అధికారులు కాలువల్లో ఉన్న మట్టిని, పెరిగిన చెట్లను తొలగింపజేసేలా చూడాలి.

– ముండాల రాజేందర్, రైతు, కనుగుట్ట

పూడికతీత పనులు చేపట్టాలి



కరత్వాడ ప్రాజెక్టులో పేరుకుపోయిన మట్టిపూడిక తీసివేస్తేనే నీరు నిల్వ ఉంటుంది. వర్షం కురిసినప్పుడు ప్రాజెక్టు త్వరగా నిండిపోతోంది. ఎండాకాలంలో నీరు నిల్వ ఉండటం లేదు. రబీలో పంటలు ఎండిపోతున్నాయి. పూడికతీత తీస్తేనే ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంటుంది. ప్రభుత్వం పూడికతీత పనులు చేపట్టాలి.

– ఇట్టెడి మోహన్‌రెడ్డి, రైతు, బోథ్

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

- ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్



మాట్లాడుతున్న ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్

ఉట్నూర్‌రూరల్: పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఉట్నూర్‌లోని హెచ్‌కేజీఎన్ హాల్‌లో మండలంలోని గణేశ్ మండపాల నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ ఏఎస్పీ మాట్లాడుతూ గణేశ్ మండపాల ఏర్పాటుకు పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రతి మండపం వద్ద ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఉట్నూర్ సీఐ ప్రసాద్, ఎస్సై ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

నేరడిగొండ/తాంసి/బోథ్/నార్నూర్/నేరడిగొండ: గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరని సీఐలు రాజు, ఫణీందర్, వెంకటేశ్వరరావు, ప్రభాకర్ పేర్కొన్నారు. ఆయా పోలీసుస్టేషన్లలో, షాదీఖానాలో గణేశ్ మండపాల నిర్వాహకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నిర్వాహకులు మీసేవా ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రతీ గణేశ్ మండపం వద్ద సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. మండపాల వద్ద, నిమజ్జన సమయంలో డీజేలు, సౌండ్‌సిస్టంలు వాడొద్దన్నారు. ఎస్సైలు ఇమ్రాన్, జీవన్‌రెడ్డి, శ్రీసాయి, అఖిల్, రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్, ఆలిండియా బంజారాసేవ సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్‌రెడ్డి నాయక్, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్, డైరెక్టర్ కాంతరావు దుర్గె, ఏఎంసీ డైరెక్టర్ కైలాస్‌నాయక్, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫెరోజ్‌ఖాన్, బీజేపీ మండల అధ్యక్షుడు రాథోడ్ భిక్షపతి, మైనార్టీ నాయకులు బాబాఖాన్, జాకురుల్లాఖాన్, దళిత నాయకుడు బ్రిజులాల్, పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

పాఠశాలలో తీజ్ ఉత్సవాలు



పాల్గొన్న విద్యార్థినులు

ఇచ్చోడ: మండలంలోని మేడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుట్టల్లో తయారు చేసిన గోధుమ మొక్కలను పాఠశాల ఆవరణలో పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థినులు సంప్రదాయ నృత్యాలు చేసి సమీపంలో ఉన్న వాగులో నిమజ్జనం చేశారు. పాఠశాల హెచ్‌ఎం స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

భీంపూర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన మంగళి అశోక్, కమ్మరి బాలి ఇళ్లలోకి నీళ్లు చేరి సరుకులు తడిసిపోయాయి. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి వెంటనే స్పందించి సరుకులు పంపిణీ చేశారు. రాంచందర్ రెడ్డి, చిరంజీవి, ఆశన్న యాదవ్ తదితరులు ఉన్నారు.

గుప్పుమంటున్న గుడుంబా

- ఏజెన్సీలో యథేచ్ఛగా దందా
- బెల్లం, పటిక అమ్మకాలు
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న అధికారులు



గుడుంబా తయారు చేస్తున్న దృశ్యం

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ వ్యాప్తంగా గుడుంబా గుప్పుమంటోంది. మండల కేంద్రంతోపాటు లక్కారం, గంగన్నపేట, కొత్తగూడ, శాంతినగర్, ఎన్టీఆర్‌నగర్, గంగాపూర్, పులిముడగు, కొత్తగూడ, కొమ్ముగూడ, గంగాపూర్, అల్లంపల్లి, ఇంద్రవెల్లి మండలంలో గుడుంబా దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇక్కడే తయారీ చేసి విక్రయిస్తున్నారు. అడవులకు గ్రామాలు ఆనుకుని ఉండటంతో రాత్రి నాటుసారా కాస్తున్నట్లు తెలిసింది. కిరాణాషాపుల వద్ద నిషేధిత పటిక, బెల్లం అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో వ్యాపారులకు ఆదాయం రెట్టింపవుతోంది. ఈతతంగం సంబంధిత అధికారులకు తెలిసిన 'మామూలు'గా తీసుకుంటున్నట్లు సమాచారం. రెక్కాడిన బతుకులు గుడుంబా మత్తుకు చిన్నాభిన్నమవుతున్నాయి. యువత, కూలీలు గుడుంబా మత్తులో ఊగుతున్నారు.

మా దృష్టికి రాలేదు

ఏజెన్సీ ప్రాంతంలో గుడుంబా విక్రయాలు సాగుతున్నట్లు తమ దృష్టికి రాలేదు. ఇది వరకే ఉట్నూర్, నార్నూర్ మండలాల్లో దుకాణాల్లో తనిఖీ చేసి నలుగురిపై కేసు నమోదు చేశాం. ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి గుడుంబా తయారీ, విక్రయదారులపై నిఘా పెట్టాం. గుడుంబా తయారీ చేసినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలి.

– రూప్‌సింగ్, ఎక్సైజ్ శాఖ సీఐ, ఉట్నూర్

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



భీంపూర్: బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



సాత్నాల: పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరి

భీంపూర్: భారీ వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని కరంజి, గుబిడి, గోమూత్రి, అంతర్‌గావ్, అర్లీ, వడూర్, దన్నూర్, కరణ్‌వాడి గ్రామాల్లో నీట మునిగిన పంటలను మంగళవారం పరిశీలించారు. పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలో ఆయన పర్యటించి రైతులను కలిసి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు మార్గం పూర్తిగా బురదమయం కావడంతో స్థానికులతో కలిసి బైక్‌పై పంట పొలాలకు చేరుకున్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కైలాస్‌నగర్: భారీ వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, వంతెనల మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలన్నారు. పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు సాజీదొద్దీన్, గోవర్ధన్, దేవిదాస్, వేణుగోపాల్, సలీమ్, మోబిన్, తిరుపతి, అశోక్ ఉన్నారు.

నేరడిగొండ: కుప్టి గ్రామంలో నష్టపోయిన పంటలు, దెబ్బతిన్న ఇళ్లను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మంగళవారం పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, ఆత్మ డైరెక్టర్ కుంట శంకర్, నాయకులు ఉన్నారు.

- కడెం నది పరీవాహక ప్రాంతాలైన కుప్టి, కుమారి, తర్నం, వాగ్దారి గ్రామాల్లో పత్తి, సోయా పంటలను ఏవో కృష్ణవేణి పరిశీలించారు. దాదాపు 400 ఎకరాల్లో పంట దెబ్బతిందని తెలిపారు.

ఇంద్రవెల్లి: నష్టపోయిన పంటలకు సర్వే నిర్వహించి పరిహారం అందించాలని శంకర్‌గూడ పంచాయతీ పరిధిలోని గ్రామాల రైతులు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. దుబ్బగూడ, దనోర(కే) గ్రామాల్లో సుమారు 50 మంది రైతులు సాగు చేసిన పత్తి, సోయా, మొక్కజొన్న పంటలు వరద నీటితో కొట్టుకుపోయాయి.

తలమడుగు: రుయ్యాడి, కజ్జర్ల గ్రామాల్లో నష్టపోయిన పంటలను మాల సంక్షేమ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటర్ కమిటీ సభ్యుడు శశికాంత్ పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ రాజ్‌మోహన్‌కు వినతిపత్రం అందించారు.

ఉట్నూర్‌రూరల్: కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతి పెరుగుతోంది. మండలంలోని గంగన్నపేట సమీపంలో గల వరి, పత్తి పంటల్లో వరద నీరు చేరింది. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు.

సాత్నాల: భోరజ్ మండలంలో ముంపు ప్రాంతాలైన పెండల్‌వాడ, కరణ్‌వాడి శివారం, తరోడ గ్రామాల్లో తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి మంగళవారం పర్యటించారు. మండలంలో 2,230 ఎకరాల పంట నష్టం జరిగిందని, 26 గ్రామాల్లో 1,005 రైతులు నష్టపోయారు. 1685 ఎకరాల పత్తి, 265 ఎకరాల సోయాబీన్, 280 ఎకరాల కంది పంటలకు నష్టం వాటిల్లినట్లు ఏవో అష్రఫ్ తెలిపారు. సాత్నాలలో 520 ఎకరాల పత్తి, 20 ఎకరాల సోయాబీన్, 65 ఎకరాల కంది, 5 ఎకరాల మొక్కజొన్న పంట నష్టం వాటిల్లిందని ఏవో జాదవ్ కైలాష్ తెలిపారు.

- కోరట గ్రామంలో కురుస్తున్న భారీ వర్షాలకు, పెన్‌గంగ బ్యాక్‌వాటర్ తోడవడంతో చెరువులను తలపిస్తున్నాయి. గ్రామం ముంపు ప్రమాదం పొంచి ఉంది. ఏ క్షణం ఏం జరుగుతుందోనని జనం ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకున్నారు.

మంత్రి పర్యటన రద్దయినా.. మీకు నేనున్నా

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తలమడుగు మండల పర్యటన రద్దయినా మీకు నేనున్నానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా మండలంలో దెబ్బతిన్న పంటలను మంగళవారం రాత్రి పరిశీలించారు. బాధిత రైతులతో చర్చి కాలనీలో మహిళలతో మాట్లాడి సమస్య అడిగి తెలుసుకున్నారు. మీకు నేనున్నానని భరోసానిచ్చారు. అత్యధికంగా కొత్తూరు, తలమడుగు గ్రామాల్లో పంటలు నష్టపోయినట్లు తెలిపారు. ఎకరాకు నష్టపరిహారం రూ.25 వేలు ఇవ్వాలని మంత్రికి సమీక్షలో విన్నవించినట్లు చెప్పారు. అనంతరం చర్చి కాలనీలో నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు. మంత్రి పర్యటన రద్దు చేసుకుని వెళ్లిన మీ కోసం ఏ సమయమైనా లెక్క చేయకుండా వస్తానని భరోసానిచ్చారు. తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీవో శంకర్, ఏవో ప్రమోద్‌రెడ్డి, రైతులు ఉన్నారు.



నేరడిగొండ: పంటలను పరిశీలిస్తున్న గజేందర్



ఉట్నూర్‌రూరల్: పంటల్లో చేరిన వరద



రుయ్యాడిలో పరిశీలిస్తున్న భూమన్న, శశికాంత్

ఇన్‌చార్జి మంత్రి 'జూపల్లి'కి స్వాగతం



స్వాగతం పలుకుతున్న ఆడే గజేందర్, నాయకులు

నేరడిగొండ: జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన పంటలు, ఇళ్లను పరిశీలించడానికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మంగళవారం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద స్వాగతం పలికారు. బోథ్ నియోజకవర్గంలో తాజా పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జరిగిన నష్టాన్ని లిఖితపూర్వకంగా తెలిపారు. జిల్లా నాయకులు ఆడే వసంత్ రావ్, రాజశేఖర్‌రెడ్డి, రాజుయాదవ్, బద్దం పోతారెడ్డి, సద్దాం, కపిల్, బానోత్ వసంత్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న సభ్యులు

నేరడిగొండ/ఇచ్చోడ/బోథ్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేరడిగొండ, ఇచ్చోడ, బోథ్‌లో ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అసోసియేషన్ నాయకులు, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గంలోని మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండలోని నివాసంలో మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. బోథ్‌కు చెందిన మెడిచేల్మా గంగా లక్ష్మికి రూ.60వేలు, ఇచ్చోడ మండలం జల్దా గ్రామానికి చెందిన ముస్లే అరుణకు రూ.39 వేలు, కామగిరి గ్రామానికి చెందిన మారొతి కనకకు రూ.17,500, నేరడిగొండ మండలం వడూర్‌కు చెందిన మాడెపు రాధకు రూ.27వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు.

దరఖాస్తు చేసుకోండి

జైనథ్: రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాలకు సంబంధించిన లబ్ధిదారులు మంగళవారం ఆయా గ్రామాల్లో కేటాయించిన తేదీల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో మహేశ్ కుమార్ ఓ ప్రకటనలో సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రతీ పంచాయతీ కార్యాలయంలో వారికి కేటాయించిన తేదీల్లో గ్రామసభ ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీబీ నియంత్రణ అధికారికి సన్మానం



సుమలతను సన్మానిస్తున్న రిమ్స్ డైరెక్టర్, డీఎంహెచ్‌ఓ, అసోసియేషన్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ సుమలత ఇటీవల ట్యూబర్క్యులోసిస్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అవార్డును దక్కించుకున్నారు. తెలంగాణ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్‌లు మంగళవారం రిమ్స్‌లో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ ఆమె సేవలను అభినందించారు. తెలంగాణ వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, మెడికల్ ఆఫీసర్ సాయిప్రియ, రఘురాం, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.